క్లుప్తంగా

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

మంత్రికి విన్నవించిన దాసర్లపల్లివాసులు



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం దాసర్లపల్లికి చెందిన వార్డు సభ్యులు కలిసి సన్మానించారు. అనంతరం తమ గ్రామానికి రద్దయిన ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. వెంటనే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు యుగంధర్‌గౌడ్, శారదశేఖర్‌ముదిరాజ్, మహ్మద్ రహీజ్, శివశంకర్‌గౌడ్, కృష్ణ, రాజేందర్‌ముదిరాజ్, కాజా, శ్రీరాములు, రాములు, యాదయ్య, రాజు, శేఖర్‌గౌడ్, కృష్ణాగౌడ్, రాములు, లింగమయ్య, రాజు, ఖాదర్‌పాషా, అలీ, షేక్ షబీర్, బాల్‌రాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

పీవీటీ మార్కెట్‌లో లక్కీ డ్రా

విజేతలకు బహుమతులు అందజేత



లక్కీ డ్రా తీస్తున్న కమిటీ ప్రతినిధులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి కొత్తపేటలోని పీవీటీ మార్కెట్ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వినియోగదారుల సమక్షంలో లక్కీడ్రా తీశారు. గత నెల 10 నుంచి డిసెంబరు 13 వరకు ప్రతి వెయ్యి కొనుగోలుపై వినియోగదారులకు కూపన్‌లు అందజేశారు. అనంతరం వంద మంది వినియోగదారులకు లక్కీ డ్రా తీసి బహుమతులు ఇచ్చారు. మొదటి బహుమతి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, 8 మందికి యాక్టివాలు, 11 మందికి రూ.5వేలు, 80 మందికి రూ.3వేల చొప్పున నగదును అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ధనుంజయ, శ్రీధర్, శ్రీనివాసులు, కృష్ణ, భిక్షపతి, చంద్రయ్య, పురుషోత్తం, దానయ్య, సోమయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆశీర్వాదం



చిన్నారులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని సార్లరావులపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాస్ నాయక్ కుమారుడు, కుమార్తెల పుట్టిన రోజు వేడుకకు శుక్రవారం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, సర్పంచ్ రజితప్రవీణ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు జంగయ్య, గోవర్ధన్‌నాయక్, వెంకటేష్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కొత్తపేట, మారుతీనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు. 11కేవీ శ్రీనివాస కాలనీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి 11.30 వరకు. 11కేవీ గణేష్‌నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ మన్సూరాబాద్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. 11కేవీ స్వాతి రెసిడెన్సీ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పీపీఈ సేఫ్టీ కిట్ల పంపిణీ

వనస్థలిపురం: పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో అనారోగ్యాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ఆయన పీపీఈ సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

నాగోలు: డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, కొత్త పోల్స్ ఏర్పాటు చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ విద్యుత్ శాఖ అధికారులను కోరారు. శుక్రవారం ఏఈ కరుణాకర్ బాబుకు వినతిపత్రం అందజేశారు.

పనులు ఆపారు.. సమస్య మరిచారు

- అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు
- జనప్రియ మహానగర్‌లో నిర్మాణానికి బ్రేక్
- తీవ్ర అవస్థలు పడుతున్న స్థానికులు



జనప్రియ మహానగర్‌లో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

మీర్‌పేట: రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేయడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నత్తకు నడక నేర్పిన చందంగా అధికార యంత్రాంగం పనుల విషయంలో జాప్యం వహిస్తోంది. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జనప్రియ మహానగర్‌లో మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షానికి వరదనీరు ముంచెత్తడంతో ఓ వైపు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తరువాత ముంపు సమస్య పరిష్కారం కోసం కాలనీ మీదుగా అధికారులు ట్రంక్‌లైన్ వేశారు. వాటి పనులు పూర్తయి సంవత్సరం గడిచినా రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దాదాపు 8 నెలల క్రితం బీటీ రోడ్డు వేసేందుకు గాను రూ.50 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. కాలనీ ముఖద్వారం నుంచి సగం వరకు రహదారి వేయించిన అధికారులు మిగతా సగం వేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. కొంత వరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రెండు నెలలుగా నిలిపివేయడంతో జనప్రియవాసులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, కార్మికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు శ్రమించాల్సి వస్తోంది.

పార్కింగ్‌కు అడ్డాగా..

అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు ఓ వైపు పూర్తిగా అందుబాటులో లేకపోవడంతో వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం మార్గం సైతం చిన్నగా ఉండడంతో వాహనాల రద్దీ ఎక్కువ అయింది. పనుల నిమిత్తం బయటికి వెళ్లే స్థానికులు రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. రహదారి ధ్వంసమైన చాలా కాలం తరువాత బీటీ రోడ్డు వేస్తుండడంతో సమస్య పరిష్కారం అవుతుందని అనుకునేలోపే కాంట్రాక్టర్ సగంలోనే వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సైతం కురవడంతో బురదమయంగా మారుతోంది. అధికారులు స్పందించి మిగతా పనులను వెంటనే ప్రారంభించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

> **త్వరలో ప్రారంభిస్తాం..**
>
> ముడిసరకు కొరత వల్ల రోడ్డు పనులను మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చింది. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. త్వరలోనే పనులు మొదలు పెడతాం. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.
>
> – శ్రీనివాస్, ఏఈ, మీర్‌పేట

గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- డీఎం మోహన్‌రెడ్డి



మోహన్‌రెడ్డి, డిపో మేనేజర్, మహేశ్వరం

మహేశ్వరం: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయాలనుకునే మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డులు చూపించాలని మహేశ్వరం డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం డిపోలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నెల 9 నుంచి మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. మహేశ్వరం డిపోలో మొత్తం 68 ఆర్డినరీ బస్సులు ఉన్నాయన్నారు. ఈ బస్సుల్లో 75 శాతం మంది మహిళా ప్రయాణికులే ప్రయాణం చేస్తున్నారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయాలంటే తెలంగాణ ప్రాంతానికి చెందిన వారీగా ధ్రువీకరణను తెలిపే ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ, రేషన్ కార్డును చూపించి జీరో టికెట్ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సూచించిన మూడు గుర్తింపు కార్డులు ప్రతి మహిళ తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. డిపోలో మహాలక్ష్మి పథకం ప్రారంభం కాకముందు రోజూ రూ.7.50 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ప్రస్తుతం రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల ఆదాయం మాత్రమే వస్తుందన్నారు.

ఉచిత న్యాయ సలహా కేంద్రం ప్రారంభం



ఉచిత న్యాయ సలహా కేంద్రం ప్రారంభించి మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

దిల్‌సుఖ్‌నగర్: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ఉచిత న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఈ ఉచిత న్యాయ సలహా కేంద్రం సేవలు వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధుయాష్కీగౌడ్ అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని శివపురికాలనీలో మధుయాష్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సలహా కేంద్రానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఇక్కడి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య, ప్రతి శనివారం ఉదయం 11 గంటల నుంచి 1 గంటలకు న్యాయ నిపుణులు అందుబాటులో ఉంటరని తెలిపారు. ఈ న్యాయ సలహా కేంద్రాన్ని హైకోర్టు న్యాయవాది, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ చలకాని వెంకట్ యాదవ్ సమన్వయం చేస్తారని తెలిపారు. న్యాయవాదులు దాసరి శ్రీనివాస్, ప్రదీప్, ఊర్మిళ, లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకాష్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, కిషోర్‌గౌడ్, నవీన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జాబ్ క్యాలెండర్



మధుయాష్కీకి మొక్కను అందచేస్తున్న హాస్టల్ విద్యార్థులు

చంపాపేట: కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేసి అర్హత కలిగిన నిరుద్యోగులకు ఉద్యోగ భరోసా కల్పించనున్నదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ అన్నారు. శుక్రవారం చంపాపేట లోని ప్రభుత్వ బాలుర, బాలికల వికలాంగుల వసతి గృహంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మధుయాష్కీ జన్మదిన వేడుకను నిర్వహించారు. దీనికి హాజరైన మాధుయాష్కీ వసతి గృహంలో సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి విద్యార్థుల అభ్యర్థన మేరకు తన సొంత ఖర్చులతో రెండు లక్షల విలువైన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, సీసీ కెమెరాలు, సీలింగ్ ఫ్యాన్‌లు, వాషింగ్ మిషన్, ఇంటర్‌నెట్ ఇతర సామగ్రిని మధుయాష్కీ ఫౌండేషన్ తరఫున అందచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ విముక్తి ప్రదాత వల్లభాయ్ పటేల్

చాదర్‌ఘాట్: నిజాం కబంధహస్తాల నుండి తెలంగాణకు విముక్తి చేసిన స్ఫూర్తి ప్రదాత సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం పటేల్ వర్ధంతి పురస్కరించుకొని ఓల్డ్‌మలక్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని ద్వారకానగర్‌కాలనీలో జరుగుతున్న కమ్యూనిటీ హాల్‌నిర్మాణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ సుజాతనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ తమకాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరితగతిన పూర్తికావడమే కాకుండా పనులలో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ఏఈ హేమునాయక్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, బిక్కునాయక్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షరతులు లేకుండా అడ్మిషన్లు ఇవ్వాలి

సైదాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి షరతులు లేకుండా అడ్మిషన్లు ఇవ్వాలని సైదాబాద్ మండల బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ షేక్ మహమూద్ కోరారు. శుక్రవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో వేదిక ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో షిఫ్టింగ్ పద్ధతిలో తరగతులు నిర్వహిస్తుండటంతో పలువురు విద్యార్థులు డ్రాపవట్ అవుతున్నారని అన్నారు. దాని వలన వారు బాల కార్మికులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్‌కి చెందిన మాధవికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.21 వేలు మంజూరయ్యాయి. శుక్రవారం కడ్తాల్‌లో బాధిత కుటుంబ సభ్యులకు స్థానిక జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. వైస్ ఎంపీపీ ఆనంద్, నర్సింహ, గణేశ్, శ్రీను ఉన్నారు.



మధుయాష్కీగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జంగారెడ్డి తదితరులు

మధుయాష్కీకి శుభాకాంక్షల వెల్లువ

కందుకూరు: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి తదితరులు ఆయనతో కేక్ కట్ చేయించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, మదన్‌పాల్‌రెడ్డి, జగదీష్, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మహేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ భూములు రైతులకు పంచాలి

- బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్



కందుకూరులో విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటపై నిలబడి ఫార్మాసిటీ భూములను తిరిగి రైతులకు పంచాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఫార్మాసిటీని రద్దు చేసి రైతుల నుంచి సేకరించిన భూములను వారికే అప్పగిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. దాన్ని విస్మరిస్తూ ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో మెగాసిటీని ఏర్పాటు చేస్తామని చెప్పడం రైతుల్ని మోసం చేయడమేనని విమర్శించారు. మెగాసిటీ టౌన్‌షిప్ పేరుతో కాంగ్రెస్ ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపిందని ఆరోపించారు. ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభించేవన్నారు. టౌన్‌షిప్ నిర్మిస్తే ఉపాధి అవకాశాలు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకునే బదులు పొలాలను రైతులకు ఇచ్చేలా కృషి చేయాలని హితవుపలికారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగయ్య, సోషల్ మీడియా కన్వీనర్ దీక్షిత్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కబ్జాలపై నేతల ఆగ్రహం

- పెద్ద చెరువు కట్ట కింద ఇష్టానుసారంగా ఆక్రమణలు



ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువు కట్ట కింద ఇష్టానుసారంగా కొనసాగుతున్న కబ్జాలపై గ్రామ నాయకులు ఆందోళనకు దిగారు. 223 సర్వే నంబర్‌లో కబ్జాకు గురవుతున్న స్థలాలను శుక్రవారం మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు యంజాల అర్జున్‌లు కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. పాఠశాల భవనం కోసం కేటాయించిన స్థలం కూడా కబ్జాకు గురవుతుండడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కట్ట కింద కొంత మంది నాయకులు, నీటి పారుదల, రెవెన్యూ అధికారులు ముఠాగా ఏర్పడి భూములను విక్రయిస్తున్నారని ఆరోపించారు. కుల సంఘాలకు కేటాయించిన భూములలోని శిలాఫలకాల బోర్డులను సైతం ధ్వంసం చేసిన ఘటనలపై స్పందించి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మురుగునీటి శుద్ధి కేంద్రం పరిశీలన



నాగోలు మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: రాబోయే రోజుల్లో మురికి కాలువల్లో సివరేజ్ కలవకుండా చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగోలు డివిజన్ పరిధిలోని జైపురి కాలనీ సమీపంలో ఉన్న ఎస్‌టీపీప్లాంట్‌లో జరుగుతున్న మురుగునీటి శుద్ధి కేంద్రంను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పహాడిషరీఫ్ నుంచి ఉస్మానియా హాస్పిటల్ నుంచి ఇక్కడ వరకు సేవరేజ్ ఇక్కడికి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే సేవరేజ్ మూసిలో కలవకుండా ట్రీట్మెంట్ ప్లాంట్ కు డైవర్ట్ చేసి అక్కడ ట్రీట్మెంట్ చేసి స్వచ్ఛమైన నీటిని మూసిలోకి వదులుతారన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్‌లోని శరవణభవాలయంలో సుబ్రమణ్యేశ్వర స్వామి షష్టి బ్రహ్మోత్సవాలను శనివారం నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇతర వివరాలకు 83329 00101, 63034 62850 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలి



పారిశుద్ధ్య కార్మికులకు కిట్‌లను పంపిణీ చేస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటనే కాలనీలు శుభ్రంగా ఉంటాయని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సేఫ్టీ కిట్‌లను శుక్రవారం సచివాలయనగర్‌లోని వార్డు కార్యాలయంలో లచ్చిరెడ్డి అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎస్ అజీముద్దిన్, నాయకులు విష్ణువర్ధన్, పవన్‌రెడ్డి, పురుషోత్తం, బాలకృష్ణ, చంద్రశేఖర్, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలందరికి లబ్ధి చేకూరుతుందని, దీని ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆటో సంఘాల ఆధ్వర్యంలో చైతన్యపురిలో శుక్రవారం జరిగిన ఆటో డ్రైవర్ల సమ్మెకు బద్దం మద్దతు పలికారు. దాసరి జయప్రకాష్, శ్రవణ్, సతీష్, మురళి, గిరీష్ పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రద్దు హర్షణీయం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఫార్మాసిటీ స్థానంలో మెగాసిటీ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఫార్మాసిటీని హైదరాబాద్‌కు దూరంగా తరలించాలని నిర్ణయించడం సరైందే అని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డిని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన నాయకులు ఘనంగా సత్కరించారు. కసిరెడ్డి మాట్లాడుతూ.. ఫార్మాసిటీ ఏర్పాటును కందుకూరు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని.. ఎన్నికల సమయంలో, అంతకుముందు కాంగ్రెస్ పార్టీ ఫార్మాసిటీని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఫార్మాసిటీని ఏర్పాటు చేయకుండా ఆ స్థానంలో మెగా టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయనుందని ఆయన చెప్పారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఆమనగల్లు మాజీ వార్డు సభ్యుడు అల్లాజీ, మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఫరీద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

యాచారం: కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం సరైందేనని.. అదే విధంగా ఫార్మా భూసేకరణలో కొంతమంది అధికారులు, బ్రోకర్లు రూ.కోట్లాది అక్రమాలకు పాల్పడ్డారని.. వెంటనే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నానక్‌నగర్ మాజీ సర్పంచ్ ముత్యాల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి గ్రామాల రైతులతో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఫార్మాసిటీ భూసేకరణలో భారీ అవినీతి జరిగిందని.. పేద రైతులకు చెందాల్సిన డబ్బులను అధికారులు, బ్రోకర్లు తినేశారని అన్నారు. వెంటనే విచారణ జరిపి రైతులకు నష్టపోయిన డబ్బులను ఇప్పించాలని కోరారు. త్వరలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఏఐసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కలిసి ఫిర్యాదు చేస్తామని అన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఇబ్రహీంపట్నం: కాలుష్యకారక ఫార్మాసిటీని రద్దుచేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమైన అంశమని తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత జగదీశ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. యాచారం, కందుకూర్ మండలాల ప్రజలు వద్దంటున్నా అక్రమంగా భూములు లాక్కొని గత ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసిందన్నారు. ఫార్మాతో సుమారు 150 కిలో మీటర్ల రేడియేషన్ పరిధిలో గాలి, నీరు కలుషితమై ప్రజల ప్రాణాలకు పెనుముప్పుగా మారే అవకాశం ఉందని మేధావులు, ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా పెడచెవిన పెట్టిందన్నారు. ఫార్మాసిటీకి దిగువ భాగంలో ఉండే ఇబ్రహీంపట్నం మండల ప్రజలకు మరింత ముప్పుగా మారేదన్నారు. ఫార్మాసిటీని రద్దుచేసి ఆస్థానంలో మెగా టౌన్‌షిప్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంతో పాటు కల్వకుర్తి, మహేశ్వరం నియోజకవర్గాల్లోని చాలా ప్రాంతాల్లో ఫార్మాసిటీకి సంబంధించి దుష్ప్రభావాలు పడే అవకాశం ఉందన్నారు. నీటి కలుషితంతో పాటు స్థానికంగా రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. మెజార్టీ ప్రజలు వ్యతిరేకించిన ఫార్మాసిటీని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంతో రైతులనుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. మెగా టౌన్‌షిప్ ఏర్పాటుతో ఇక్కడ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు లభించే విధంగా ఫార్మా భూములను ఉపయోగించుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.